సాక్షి

పార్వతీపురం మన్యం


ఆదివారం । 21 । మే । 2023



ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి?
ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు విజయనగరం జిల్లాకు చేసిన అభివృద్ధి చెప్పాలని జెడ్పీచైర్మన్ ప్రశ్నించారు. - IIలో



అధికార దాహం తీరలేదు..
టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అధికార దాహం తీరలేదని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు విమర్శించారు. - IIలో



మృత్యుగాలి
పెద్దగెడ్డ జలాశయంలో ఈదురుగాలుల ధాటికి పడవబోల్తా పడిన ఘటనలో ఒక గిరిజన మత్స్యకారుడు మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు. - IIలో

న్యూస్‌రీల్

పార్వతీపురం మన్యం జేసీగా గోవిందరావు



ఆర్.గోవిందరావు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆర్.గోవిందరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ప్రస్తుతం ఏపీ టూరిజమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్)లో పనిచేస్తున్నారు. ఆయన త్వరలో జేసీగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని కార్యాలయవర్గాలు తెలిపాయి. ఇక్కడ పనిచేసిన ఒ.ఆనంద్ బదిలీ అయిన విషయం పాఠకులకు తెలిసినదే.

బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: బదిలీకోరే వసతి గృహ సంరక్షకులు, నాన్ టీచింగ్, మినిస్టీరియల్, నాల్గవ తరగతి ఉద్యోగులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు బి.సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు తప్పనిసరిగా బదిలీ అవుతుందన్నారు. రెండేళ్లు పూర్తిచేసుకొన్న వారు రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విధివిధానాలకు లోబడి దరఖాస్తులను పార్వతీపురం, గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నాణ్యమైన నిర్మాణ సామగ్రి



బలిజిపేట లే అవుట్ వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

బలిజిపేట: గృహ నిర్మాణాలకు ప్రభుత్వం నాణ్యమైన సామగ్రి సరఫరా చేస్తున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. బలిజిపేట, నారాయణపురం, బర్లి గ్రామాల్లోని వైఎస్సార్ జగనన్న కాలనీలను శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లుల చెల్లింపు, నిర్మాణసామగ్రి సరఫరాపై ఆరా తీశారు. నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. నారాయణపురంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని, బర్లిలో నాడు–నేడు పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను ముచ్చటించారు. బర్లి అంగన్‌వాడీ కేంద్రానికి తక్షణమే విద్యుత్ సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ భానుమూర్తి, ఇన్‌చార్జి తహసీల్దార్ రత్నకుమారి, గృహ నిర్మాణశాఖ డీఈఈ ప్రసాద్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.విజయగౌరి, సీడీ పీఓ సుగుణ, ఎంఈఓ శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీఎంఅండ్‌హెచ్‌ఓ జగన్నాథరావు



దోమలనివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ఊరూరా, ఇంటింటా తలపెట్టిన దోమల నివారణ మందు పిచికారీకి ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి.జగన్నాథరావు కోరారు. మండలంలోని పెదబొండపల్లి పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న డ్రైడేను శనివారం పరిశీలించారు. దోమల నివారణ మందును ప్రతీగృహం లోపల, బయట పిచికారీ చేయాలని సిబ్బందికి సూచించారు. దీనివల్ల మలేరియా, డెంగీ కారక దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు. ఆయన వెంట జిల్లా మలేరియా ఇన్‌చార్జి అధికారి ఎం.శ్యామ్‌కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

- పేదల ఇళ్లను సమాధులతో పోల్చడంపై మండిపాటు
- పేదలంటే అంతచులకనా అంటూ నిలదీత
- ఊరూరా నిరసన ప్రదర్శనలు
- చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినదించిన జనం
- ఆయన దిష్టిబొమ్మలను దహనం చేసిన పేదలు
- వారికి మద్దతుగా నిలిచిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- చంద్రబాబుపై కేసు నమోదుచేయాలని పోలీసులకు ఫిర్యాదు

చంద్రబాబు వ్యాఖ్యలపై ఆగ్రహజ్వాల

పేదల ఇళ్లు సమాధులతో సమానమంటూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలపై ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆగ్రహజ్వాల రగిలింది. ఊరూరా శనివారం నిరసన ప్రదర్శనలు చేశారు. చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినదించారు. పేదలంటే ఎందుకంత చులకన భావం అంటూ నిలదీశారు. నీ వలే అవినీతి సొమ్ము మా వద్ద ఉంటే మేముకూడా నీలాంటి పెద్ద భవంతుల్లోనే ఉండేవారమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల సొంతింటి కలను సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చుతుంటే... ఆహ్వానించాల్సింది పోయి ఎందుకంత అక్కసు అంటూ మండిపడ్డారు. పేదలను కించపరిచేలా మాట్లాడిన చంద్రబాబుపై కేసు నమోదుచేయాలంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వచ్చే ఎన్నికల్లో పేదల ప్రతాపాన్ని మరోసారి రుచి చూపిస్తాం .. ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.



పార్వతీపురంటౌన్: నర్సిపురం వద్ద చేపట్టిన నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే జోగారావు, లబ్ధిదారులు



పార్వతీపురంటౌన్: చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే, గృహ లబ్ధిదారులు



కురుపాం: రావాడ కూడలిలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఇళ్ల లబ్ధిదారులు



చీపురుపల్లి మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

పార్వతీపురంటౌన్: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ కొత్త ఊళ్లను నిర్మిస్తుంటే... వాటిని సమాధులతో పోల్చుతూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై పేదలు మండిపడ్డారు. అహంకార పూరిత వ్యాఖ్యలకు తగిన జవాబు ఇస్తామని ఇళ్ల లబ్ధిదారులు హెచ్చరించారు. టీడీపీని సమాధి చేస్తామని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పార్వతీపురం మండలంలోని నర్సిపురం జగనన్న లేఅవుట్ వద్ద లబ్ధిదారులు మానవహారంగా ఏర్పడి ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో రాష్ట్రంలో 30లక్షలపై చిలుకు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. ప్రత్యేకంగా 17 వేల వైఎస్సార్ జగనన్న కాలనీల్లో కొత్త ఇళ్ల నిర్మాణాలతో ఊళ్లను తలపిస్తున్నాయని తెలిపారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కోర్టుల ద్వారా అడ్డుకోవాలని చూసిన చంద్రబాబునాయుడుకు ఇటీవలే కోర్టు తీర్పు చెంపపెట్టులా మారిందన్నారు. తమకు ఇచ్చిన ఇళ్లను సమాధులతో పోల్చిన చంద్రబాబును 2024 ఎన్నికల్లో తామంతా కలిసి సమాధి చేస్తామని హెచ్చరిస్తూ.. ఖబడ్దార్ చంద్రబాబు అంటూ లబ్ధిదారులు ముక్తకంఠంతో హెచ్చరించారు. కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్పర్సన్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు, పట్టణ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కురుపాంలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

కురుపాం: పేదల ఇళ్లపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కురుపాం నియోజకవర్గంలోని రావాడ కూడలిలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబునాయుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీలు ఉరిటి రామారావు, దీనమయ, శెట్టి పద్మావతి, శెట్టి శ్యామల, జెడ్పీవైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, జెడ్పీటీసీలు మూడడ్ల శశికల, గొర్లి సుజాతలు మాట్లాడుతూ రాజకీయాల్లో సీనియర్ నేతగా తనకు తానే గొప్పలు చెప్పుకొనే చంద్రబాబుకు బడుగు బలహీన వర్గాలంటే చిన్నచూపన్నారు. అహంకార పూరిత వ్యాఖ్యలను మానుకోవాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినదించి దిష్టిబొమ్మను దహనంచేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అయ్యరక, రజక కార్పొరేషన్ల డైరెక్టర్లు గవర విజయ్, గోరిశెట్టి గిరిబాబు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, జియ్యమ్మవలస వైస్ ఎంపీపీ సంపత్ కుమార్, ఏపీఎంఎస్ ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అంధవరపు కోటేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కురుపాం మండల కేంద్రంలోని రావాడ కూడలిలో ఇళ్లలబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన ప్రదర్శన

చీపురుపల్లిలో నిరసన

చీపురుపల్లి: పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు, నిర్మాణాలపై చంద్రబాబు నాయుడు చేసిన అప్రజాస్వామిక వ్యాఖ్యలకు నిరసనగా చీపురుపల్లి పట్టణంలో లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. లావేరురోడ్, మెయిన్‌రోడ్ మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి చంద్రబాబు డౌన్‌డౌన్, తక్షణమే అరెస్ట్ చేయాలంటూ నినదించారు. పేదలకు అన్యాయం జరిగేలా, హేళన చేస్తూ వ్యాఖ్యలు చేసిన చంద్రబాబునాయుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలంటూ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

వెంటిలేటర్‌పై టీడీపీ

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి వెంటిలేటర్‌పై కొన ఊపిరితో వైద్యం పొందుతున్న రోగి మాదిరిగా ఉందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడీక రాజన్నదొర పేర్కొన్నారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినవలసలో శనివారం నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గడిచిన నాలుగేళ్లలో 70వేల ఎకరాలను సేకరించి 17 వేల వైఎస్సార్ జగనన్న కాలనీల నిర్మాణాన్ని తలపెట్టిన దేశంలోనే దమ్మున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఆయన సింహంలాంటి వారని, సింగిల్‌గానే బరిలో దిగుతారని, టీడీపీలా పూటకో వేషం, రోజుకో పార్టీతో పొత్తులుపెట్టుకునే బాపతు కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. మరో 30 ఏళ్లు జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ధీమా వ్యక్తంచేశారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్

- ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్

పార్వతీపురం: జిల్లాలో ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పరీక్ష ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అన్నింటిలోనూ మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. విద్యుత్, వైద్య, రక్షణ చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షలు ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకెండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారి డి.మంజులావీణ, రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఎం.ఆదినారాయణ, హెచ్‌సెక్షన్ పర్యవేక్షకులు డి.రవి, విద్యాశాఖ సహాయ సంచాలకులు పి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజారవాణా అధికారి టి.వి.ఎస్. సుధాకర్, మున్సిపల్ సహాయ ఇంజినీర్ ఆనంద్, సీఐ ఎ.వి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

విద్యలనగరంలో కబడ్డీ కూత

- ప్రారంభమైన రాష్ట్ర స్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీలు
- అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో 13 జిల్లాల నుంచి హాజరైన జట్లు
- పోటీలను ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- రాష్ట్రంలో కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి



కబడ్డీ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



పోటీలకు హాజరైన బాలబాలికల జట్లు



హోరాహోరీగా విజయనగరం–అనంతపురం పురుషుల కబడ్డీ మ్యాచ్

విజయనగరం: విద్యలనగంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియం వేదికగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న అండర్–19 బాల, బాలికల అంతర్ జిల్లాల పోటీలను జెడ్పీ చైర్మన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన బాల, బాలికల జట్లు హాజరయ్యాయి. వీరినుద్దేశించి జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణక్రీడ అయిన కబడ్డీ అభివృద్ధిలో భాగంగా ప్రత్యేక అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి అకాడమీ ఏర్పాటు విషయాన్ని తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కబడ్డీ క్రీడకు పేరొందిన విజయనగరం జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులంతా మంచి ఆట తీరుతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులందరికీ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహకారంతో భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్రీడారంగం అభివృద్ధితో పాటు ప్రతిభ గల క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

- నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిలు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో రాణించి తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి పేరు తేవాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జిల్లా కోఆర్డినేటర్ చంద్రావతి, సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, పార్వతీపురం–మన్యం జిల్లా చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, డీవీఈఓ కె.సురేష్‌కుమార్, రాష్ట్రస్థాయి పోటీల అబ్జర్వర్ జయరాజ్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కంటుభుక్త తవిటిరాజు, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు పి.చిన్నంనాయుడు, అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ, విశ్రాంత కార్యదర్శి బొమ్మన రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.తవుడుబాబు, సూర్యారావు, కె.ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

విజయనగరం వేదికగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అండర్–19 బాల, బాలికల కబడ్డీ పోటీలు మొదటి రోజు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో సింథటిక్ మ్యాట్‌పై పోటీలు నిర్వహించారు. మొదటి రోజు జరిగిన మ్యాచ్‌లలో బాలుర విభాగంలో చిత్తూరు జట్టుపై కృష్ణా జట్టు, ప.గో.జిల్లాపై గుంటూరు జట్టు, కడప జట్టుపై నెల్లూరు జట్టు, కర్నూలు జట్టుపై శ్రీకాకుళం జట్టు, అనంతపురం జట్టుపై విశాఖ జట్టు, అనంతపురం జట్టుపై అతిథ్య విజయనగరం జట్టు విజయం సాధించాయి. బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై నెల్లూరు, విశాఖ జట్టుపై చిత్తూరు, ప.గో. జట్టుపై గుంటూరు, తూ.గో. జట్టుపై విజయనగరం, విశాఖ జట్టుపై శ్రీకాకుళం జట్టు విజయం సాధించాయి. రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారంతో ముగియనుండగా.. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికచేయనున్నారు.

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలో జరిగే వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ నెల 30 నుంచి జూన్ 4వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ మేరకు శనివారం ఫ్యాక్టరీ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన ఆలయ పాలకవర్గ మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు నిర్ణయాలు తీసుకున్నారు. బ్రహ్మోత్సవాలకు అయ్యే ఖర్చు మొత్తం పాలక మండలి సభ్యులే భరించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడైన ఎమ్మెల్యే రూ.లక్షను విరాళంగా అందజేశారు. పాలక మండలి సభ్యులు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి రూ.20 వేలు, కె.వి.జి.పి.బంగార్రాజు రూ.10 వేలు, తోట మధుసూదనరావు రూ.10 వేలను విరాళంగా ఇస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో సుగర్ ఫ్యాక్టరీ ఎండీ విక్టర్‌రాజు, జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు సర్వం సిద్ధం

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్–19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల ఖోఖో పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా కేంద్రంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 21, 22 తేదీల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నిర్వహిస్తోన్న పోటీల్లో పాల్గొనేందుకు 13 జిల్లాలకు చెందిన 26 బాల, బాలికల జట్లు హాజరుకానున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే పోటీలకు కస్పా ఉన్నత పాఠశాల మైదానాన్ని సిద్ధం చేశారు. క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించనున్నారు. సోమవారం సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేయనున్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జాతీయ స్థాయిలో జరగనున్న అండర్–19 స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

మృతుడిది పశ్చిమబెంగాల్..

గజపతినగరం: స్థానిక రైల్వేస్టేషన్ యార్డులో ఇటీవల గుర్తించిన మృతదేహం వివరాలు తెలిశాయని, పశ్చిమబెంగాల్‌కు చెందిన సలీమ్ సర్దార్ మృతదేహంగా గుర్తించామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ వి.ఎస్.మూర్తి శనివారం తెలిపారు. శవపంచనామా అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించామన్నారు. ఎలా చనిపోయాడన్నది దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: కొమరాడ మండలంలోని గుణానపురానికి చెందిన ఆకుల శ్రీనివాసరావు శనివారం ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. చింతపండు కొనుగోలు విషయంలో భార్యతో జరిగిన గొడవ కారణంగా అతడు ఫినాయిల్ తాగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి అతడిని తరలించారు.

తేలునాయుడువలసలో మరొకరు..

పార్వతీపురం: మండలంలోని తేలునాయుడువలసకు చెందిన ఆర్.దినేష్ ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఇదే మండలంలోని తాళ్లబురిడికి చెందిన యువతి, దినేష్ గత కొన్నాళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే యువతి తరచూ యువకుడి ఇంటికి వచ్చి, వెళ్తుండేది. ఈ క్రమంలో ఆ యువతిని యువకుడి కుటుంబీకులు ఆమెను ఆమె ఇంటికి పంపించేసేవారు. ఇదిలా ఉండగా, యువతి తండ్రి యువకుడిపై సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మనస్తాపంతో యువకుడు చీమలమందు తాగి, ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వైద్యసేవల నిమిత్తం సీతానగరం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారని పార్వతీపురం ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 484.00
శ్రీకాకుళం	రూ. 484.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800–00
బంగారం(22సి. 10గ్రా.)	56,650–00
వెండి (కిలో)	78,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹139	₹248	₹ 258

చంద్రబాబు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి?



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- చంద్రబాబుకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశ్న

విజయనగరం గంటస్తంభం: ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లాలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఎస్.కోటలో రెండు రోజుల పాటు పర్యటించిన ఆయన పేదలు, సంక్షేమ పథకాలపై తన ఆక్రోశం వెల్లగక్కడం తప్ప ఈ ప్రాంతానికి ఆయన ఏం మంచి చేశారో చెప్పలేకపోయారని ఎద్దేవా చేశారు. తోటపల్లి ప్రాజెక్టు తానే కట్టానని, పచ్చి అబద్ధాలు ఆడారన్నారు. 2003లో ఆయన ప్రాజెక్టుకు కేవలం శంకుస్థాపన మాత్రమే చేశారని, ప్రాజెక్టు మంజూరు, నిధుల కేటాయింపు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసి, ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తి చేశారని వివరించారు. మిగిలిన పనులు కూడా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ చేయలేకపోయిందని విమర్శించారు. అవే మిగిలిన పనుల పూర్తికి ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.130 కోట్లు కేటాయించారని తెలిపారు. తారకరామ పనులకు కూడా టీడీపీ చొరవ తీసుకోలేదని, ఆ పనులకు కూడా సీఎం జగనే రూ.196 కోట్లకు టెండర్లు ఆహ్వానించి, ఇటీవల శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అప్పటి ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారని, ఇప్పుడు ఆయన తనయుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి రూ.3,600 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారని, భూసేకరణ కూడా జరుగుతోందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎస్.కోట నియోజకవర్గానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

అన్నీ అబద్ధాలే..

ఎస్.కోట పర్యటనలో చంద్రబాబు అన్నీ అబద్ధాలే చెప్పుకొచ్చారని మండిపడ్డారు. పెందుర్తి, కొత్తవలస రోడ్డు విస్తరణకు తాను లేఖ రాస్తే పనులు, నిధులు మంజూరు చేశారని చెప్పడం హాస్యాస్పదమని, స్థానిక ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి కేంద్రమంత్రితో మాట్లాడి, మంజూరు చేయించారని గుర్తుచేశారు. తాటిపూడి రిజర్వాయర్ నుంచి ఎస్.కోటకు తాగునీరు సరఫరా చేయించిన ఘనత మంత్రి బొత్ససత్యనారాయణదేనన్నారు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.100 కోట్లతో పనులు ఇటీవల మంజూరు చేశామన్నారు. గిరిజన యూనివర్సిటీ కూడా ఎక్కడుందో తెలియదని ఆయన మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో అన్ని గిరిజన యూనివర్సిటీలు గిరిజన ప్రాంతాల్లో ఉంటే, మన జిల్లాలో మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపార భావంతో కొత్తవలస మండలం, రెల్ల వద్ద పెట్టాలని చూశారని ధ్వజమెత్తారు. అందుకే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గిరిజన యూనివర్సిటీకి గిరిజన ప్రాంతమైన మెంటాడ మండలంలో స్థల సేకరణ జరుగుతోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, మెడికల్ కాలేజీ, గురజాడ జేఎన్‌టీయూలపై ఆయనేమీ మాట్లాడలేకపోయారన్నారు. కనీసం బీసీలకు కూడా ఆయన ఏం చేశాడో చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని మండిపడ్డారు.

పార్టీ పదవులు, కేబినెట్‌లో కూడా అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలో ఓ బీసీ మహిళకు మంత్రి పదవి ఇచ్చి, మళ్లీ వెనక్కి లాక్కున్న ఘనత చంద్రబాబుదేనన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు అమాయకులని, అందులో విజయనగరం ప్రజలు మరీ అమాయకులని ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ కోతలు గురించి ఆయన మాట్లాడుతున్నారని, లోడ్ రిలీఫ్ కోసం గంట, అరగంట తీయడం సహజమన్నారు. ఇవి కూడా రానున్న రోజుల్లో లేకుండా చూస్తామన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు కనబడలేదా..



శృంగవరపుకోట: మీడియాతో మాట్లాడుతున్న దాసరి కులస్తులు

శృంగవరపుకోట: అధికారంలో ఉన్నప్పుడు తాము కనిపించలేదా అని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడపై దాసరి కులస్తులు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన వారు ఎస్.కోటలో పర్యటించిన చంద్రబాబు దాసరి కులస్తులతో ముఖాముఖి మాట్లాడి, సమస్యలు పరిష్కరిస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. గతంలో 15 ఏళ్లపాటు ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు దాసరిలు కనిపించలేదా అని ప్రశ్నించారు. దాసర్లను గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారి సంక్షేమమే పరమావధిగా కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్పొరేషన్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన మహిళను నియమించడంతో పాటు 14 మంది డైరెక్టర్లను కూడా నియమించి దాసర్ల బాగోగుల కోసం ఆలోచించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో దాసరి కులస్తులు ఎ.అప్పారావు, కె.ఈశ్వరి, వి.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

అధికార దాహం తీరలేదు..

కొత్తవలస:



కొత్తవలస: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అధికార దాహం తీరలేదని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు విమర్శించారు. ఇటీవల చంద్రబాబు చేసిన తప్పుడు వ్యాఖ్యలను ఖండిస్తూ మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఎస్.కోటలో చంద్రబాబు ప్రసంగమంతా తానేం అభివృద్ధి చేశారో చెప్పకుండా ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పేదలన్నా, ఎస్సీలన్నా చంద్రబాబుకు గిట్టదన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తుంటే అడ్డుకున్న ఏకైక నాయకుడు చంద్రబాబేనన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇస్తున్న ఇళ్ల స్థలాలు ఇల్లు కట్టుకోవడానికి కాదని, సమాధులు కట్టుకోవడానికి పనికివస్తాయని ఆయన అనడం చాలా దారుణమన్నారు. 40 ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ అని చెప్పుకునే ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమని, ఇదే ఆయనకు మతిభ్రమించిందనడానికి నిలువెత్తు నిదర్శమన్నారు. వయసు పైబడడంతో ఆయన ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదన్నారు. సీఎం జగనన్న పాలన మెచ్చే రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్ వెంటే ఉండడం, వచ్చే ఎన్నికల్లోనూ ఆయన పార్టీకి డిపాజిట్లు కూడా రావన్న సంగతి తెలియడంతో తీవ్ర నిరాశ, నిస్పృహల్లో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను మెచ్చుకుని, పెద్దరికం నిలబెట్టుకోవాలని హితవు పలికారు. ఆయన పుత్రుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ వల్ల టీడీపీ ఒరిగిందేమీ లేదన్నారు. వాళ్ల మాటలతో వారే ప్రజల్లో నవ్వులపాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.నాయుడుబాబు, ఎల్.కోట, వేపాడ ఎంపీపీలు జి.శ్రీనివాసరావు, డి.సత్యవంతుడు తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న లారీ

- ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- మద్యం మత్తులో లారీ డ్రైవర్
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీతానగరం పోలీసులు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

పార్వతీపురం టౌన్: విశాఖపట్నం నుంచి పార్వతీపురం వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసు సీతానగరం మండలం జోగింపేట వద్ద శనివారం రాత్రి ప్రమాదానికి గురైంది. రాయగడ నుంచి విశాఖవైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో బస్సు తుప్పల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. అయితే, బస్సుడ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. ఒకరిద్దరికి స్వల్పగాయాలయ్యాయి. పార్వతీపురం డిపో నుంచి మరో బస్సును పంపించి ప్రయాణీకులను గమ్యస్థానానికి చేర్చారు. సీతానగరం ఎస్‌ఐ నీలకంఠం, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు. మద్యం మత్తులో లారీని నడపడం వల్లే ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు.

నగదు మాయంపై ఫిర్యాదు

పూసపాటిరేగ: మండల కేంద్రానికి చెందిన తిరుమలరాజు వరహవెంకట నరసింహరాజుకు స్థానిక ఎస్‌బీఐ ఖాతా ఉంది. ఈ ఖాతా నుంచి ఈ నెల 4వ తేదీ నుంచి ఏడు వరకు విడతల వారీగా 39 వేల రూపాయలు విత్‌డ్రా అయ్యాయి. దీంతో బాధితుడు బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయంపై పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ. నరేష్ తెలిపారు.


మృత్యుగాలి

- పెద్దగెడ్డ జలాశయంలో రెండు నాటు పడవలు బోల్తా
- ఒకరు మృతి, మరొకరు గల్లంతు
- విషాదంలో కుటుంబ సభ్యులు

ప్రతిరోజు వలే సాయంత్రం సమయాన... ఆ ఇద్దరు గిరిజన మత్స్యకారులు తమ పడవలపై పెద్దగెడ్డ జలాశయంలోకి చేపల వేటకు వెళ్లారు. ఒకరికొకరు తోడుగా ముందుకు సాగారు. జలాశయం మధ్యకు చేరుకున్నారు. చీకటి పడిన వేళ.. చేపలు వలకు చిక్కుతాయని ఆశించిన సమయంలో ఈదురుగాలులు ధాటిగా వీయడంతో ఇరువురి పడవులు బోల్తాకొట్టాయి. ఇందులో ఒకరు మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు.



బంటు జోగయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



బంటు జోగయ్య(ఫైల్)

పాచిపెంట: వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు తమ భూములను త్యాగంచేశారు. తెలియని వృత్తి అయిన చేపల వేటను జీవనాధారంగా మలచుకున్నారు. బతుకు సాఫీగా సాగిపోతుందనుకున్న వేళ గాలిరూపంలో మృత్యువు కాటేసింది. పెద్దగెడ్డ జలాశయంలో చేపలవేట సాగిస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాచిపెంట మండలం కేసలి పంచాయతీ మడవలస గ్రామానికి చెందిన బంటు జోగయ్య, పద్మాపురం పంచాయతీ యార్లవలసకు చెందిన పుంగారి సీతారాం వేర్వేరు పడవల్లో పెద్దగెడ్డ జలాశయంలో శుక్రవారం సాయంత్రం చేపల వేటకు వెళ్లారు. జలాశయం మధ్యలోకి వెళ్లగానే ఈదురుగాలులు ధాటిగా వీయడంతో పడవులు బోల్తాకొటాయి. ఇద్దరూ గల్లంతయ్యారు. రాత్రి సమయం కావడంతో ప్రమాదం గురించి ఎవరికీ తెలియలేదు. వేటకు వెళ్లినవారు తిరిగిరాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు శనివారం వేకువజామునుంచే వాకబు చేశారు. తోటి మత్స్యకారులను ఆరా తీశారు. గాలి ధాటికి ఒడ్డుకు చేరుకున్నామని వారు చెప్పడంతో అనుమానంతో జలాశయం వద్దకు చేరుకున్నారు. బోట్లు బోల్తాకొట్టి ఉండడంతో గిరిజన మత్స్యకారులు, గజఈతగాళ్లు, పోలీసులు కలిసి గాలించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో బంటు జోగయ్య మృతదేహం లభ్యం కాగా, పుంగారి సీతారాం కోసం గాలిస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. కుటుంబ పెద్ద ఒకరు మృతిచెందడం, మరొకరు గల్లంతుకావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఇసుక నిల్వలపై కేసు నమోదు



ఇసుక పోగుల వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు

చీపురుపల్లిరూరల్: మండలంలోని గొల్లలములగాం రెవెన్యూ పరిధిలోని తోటలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను పోలీసులు శనివారం గుర్తించి, కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ ఇసుక నిల్వలపై తమకు ముందస్తు సమాచారం అందిందని, అక్కడికి వెళ్లి, నిర్ధారించుకున్న తర్వాతే కేసు నమోదు చేశామన్నారు. గొల్లలపాలెం గ్రామానికి చెందిన పల్ల రవి, సంతాన దుర్గాప్రసాద్ ఈ ఇసుకను నిల్వ చేసినట్లు తెలిసిందన్నారు.

అటవీ హక్కులున్న రైతులకు పంట రుణాలు



ప్రకృతి వ్యవసాయం వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అటవీ హక్కులు కలిగి ఉన్న రైతులకు డీసీసీబీ నుంచి పంట రుణాలు అందించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశానికి హాజరైన ఆయన తోటపల్లి ప్రాజెక్టు నుంచి జూన్ మొదటి వారంలో నీటిని విడుదల చేయాలని, మిగిలిన జలాశయాల నుంచి కూడా అవసరాల మేరకు నీటిని విడుదల చేయాలని తెలిపారు. నీటి విడుదలకు ముందు ఎక్కడైనా గండ్లు ఏర్పడి ఉంటే వాటిని పూడ్చాలన్నారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు యంత్ర సేవా పథకం కింద యంత్ర పరికరాలు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరావు మాట్లాడుతూ నాట్లు వేయడానికి కూలీల సమస్య ఉందని, కొన్నిచోట్ల సకాలంలో ఉడుపులు(ఉభాలు) జరగడం లేదని, దీని కోసం యంత్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు చేసినట్లు అవుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వి.తారకరామారావు మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు స్ప్రే చేయడానికి మండలానికి 3 డ్రోన్లు చొప్పున ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించా రు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులను పరిష్కరించాలి

- ఎస్పీ ఎం.దీపిక



పోలీస్ అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: జగనన్నకు చెబుదాం పోర్టల్‌లోని ప్రజాఫిర్యాదులను పరిశీలించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫిర్యాదులు అందిన వెంటనే గడువులోగా వాటిని పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. ఫిర్యాదుదారులతో కూడా మాట్లాడి, పోలీస్ శాఖ చేపట్టిన చర్యలు వివరించి, ఫిర్యాదును ముగుస్తున్నట్లుగా తెలియజేయాలన్నారు. ప్రతిరోజూ జగనన్నకు చెబుదాం పోర్టల్ లోకి వెళ్లి, ఫిర్యాదులు నోట్ చేసుకోవాలన్నారు. ఫేటల్ రోడ్ యాక్సిడెంట్ కేసుల్లో ఎప్పటికప్పుడు ప్రమాద వివరాలను ఐరాడ్ యాప్‌లో నమోదు చేయడంతో పాటు, అధికారులు సూచించిన ఈ–మెయిల్‌కు 48 గంటల్లోగా ఎఫ్ఐఆర్, ఇతర వివరాలను పంపాలని తెలిపారు. దిశా యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. దిశా మొబైల్ వాహనాలతో కళాశాలలు, పాఠశాలల వద్ద పెట్రోలింగ్ నిర్వహించి, ఈవ్ టీజింగ్ జరగకుండా చూడాలన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. కోర్టులు జారీ చేసిన నాన్ బెయిల్‌బుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గత నెలలో నమోదై, దర్యాప్తు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, న్యాయసలహాదారులు వై.పరశురాం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్.కోట సీఐ ఎస్.సింహాద్రినాయుడు, ఎస్.కోట ఎస్ఐ జె.తారకేశ్వరరావు, రాజాం సీఐ ఉపేంద్ర, రాజాం పట్టణ సీఐ కె.రవికుమార్, రాజాం ఎస్ఐ వై.రవికిరణ్, వంగర ఎస్ఐ ఆర్.జనార్ధనరావు, కొత్తవలస ఎస్ఐ బి.దేవిలను ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు.

23న క్రికెట్ జట్టు ఎంపికలు

విజయనగరం: అంతర్ జిల్లాల అండర్–14 బాలుర క్రికెట్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 23న నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు నగర శివారులోని విజ్జీ స్టేడియంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తెల్ల నిదుస్తులు, సొంత క్రికెట్ కిట్‌తో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. క్రీడాకారులు 2009 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2010 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులు విధిగా తమ జననధ్రువీకరణ పత్రంతో పాటు స్టడీ సర్టిఫికెట్ వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 96668 18126 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.